# పాత పరిచయం

**త**న్ను చూడ్డానికి వచ్చిన భాస్కర్రావును చూడగానే పార్వతి బుర్రలో ఏదో సంచలనం గలిగింది. అతన్ని పెళ్లాడాలని ఉందా. ఆడరాదని ఉందా తన మనస్సులో?

అతనికి దాదాపు 30 ఏళ్లుండవచ్చును. తనుక పధ్నాలుగో ఏడిప్పుడే ప్రవేశించింది! ఇద్దరికీ పదహారేళ్లు తేడా. ఇదేమన్నా తనను బాధిస్తున్నదా?

తనను బాధిస్తున్నది అది కాదని పార్వతి రూఢి చేసుకుంది. మరేమిటి?

"నీకిష్టమేనటే. అమ్మా?" అని తల్లడిగినప్పుడు పార్వతేమీ చెప్పలేక పోయింది. పిల్ల సిగ్గుపడుతున్నదని తల్లి అనుకుంది.

భాస్కర్రావు అందంగానే ఉన్నాడు. చలాకీగా కూడా మాట్లాడాడు. అతన్ని చూస్తే పార్వతికి ఏదో ఒక విధమైన ఆనందం కలుగుతున్నమాట నిజమే గాని ఆ ఆనందం వెంట ఇంకేదో కూడా కలుగుతున్నది.

"ఏమిటది?"

పార్వతి అకస్మాత్తుగా ఉలికిపడ్డది. ఆమె ఆలోచనా ప్రయత్నం ఫలించింది. ఇతన్ని – ఈ మొహం – తను పూర్వం చూసింది. అయిదేళ్ల క్రితం, బాపట్లలో.

బాపట్లలో ఆ వీర్రాఘవులుగారమ్మాయి ఉండేది. తన స్నేహితురాలు వాళ్లింటి పక్కనే ఆ పంతులమ్మ ఉండేది. ఎంత బాగుండేది పంతులమ్మ! కోపమన్నమాట లేదు. నవ్వుమొహం.

ఒకరోజు రాత్రి, తను వీర్రాఘవులుగారింట్లో పడుకున్నప్పుడు, తన స్నేహితురాలు, బాగా పొద్దుపోయినవేళ, "నీకో తమాషా చూపిస్తా రావే!" అని తనను పిలుచుకుపోయింది.

చప్పుడు చెయ్యకుండా పిల్లిలాగా అడుగులో అడుగు వేసుకుంటూ అది పంతులమ్మగారి దొడ్డివాకిలి వేపు దారితీసింది. తనకు గుండెల్లో రైళ్లు పరిగెత్తినై. దానికెంత ధైర్యం! తనకు ముందుకు పోబుద్ధి పుట్టకపోయినా పిరికిదనిపించుకోవటం ఇష్టంలేక ముందుకు సాగింది.

ఆ తరవాత తలుపు కంతల్లోనించి చూచారు!

ఆ దృశ్యం ఇంకా తన కళ్ల ముందాడుతూనే ఉంది. ఆ పంతులమ్మ చాపమీద కూర్చుని ఉంది, ఆమె పక్కనే పడుకుని ఉన్నాడు. ఆమె ఒళ్లంతా ప్రేమగా తడువుతూ, మధ్యమధ్య ఆమెను తనమీదికి వంచుకుని చాలా చాలాసేపు ముద్దు పెట్టుకుంటూ – ఇతనే!

ఈ భాస్కర్రావే! ఈ మొహమే! ఇదే జుట్టూ! కళ్లూ ! అప్పుడు కొట్టుకున్నట్టే పార్వతి గుండె మళ్లీ కొట్టుకోసాగింది.

ఆ పంతులమ్మమీద తనకప్పుడు కోపం వచ్చిందా, లేదా? పార్వతి తేల్చుకోలేక పోయింది.

ఆ మనిషే తన భర్తా? తను ఇటువంటి పెళ్లికి ఒప్పుకోగలదా?

సమాధానం తెలీలేదు... ఆ పంతులమ్మను ఎంత అపేక్షగా చూశాడూ!

"ఏమే, అమ్మా! మీ అమ్మ అడిగితే చెప్పలేదుటగా? కుర్రాణ్ని చూశావుగా? నీకిష్టమైనట్టేనా?" అన్నాడు తండ్రి.

"నాకు తెలీదు, నాన్నా!" అని పచ్చి నిజం చెప్పింది పార్వతి. పార్వతికి తన్ను చూస్తే తనకే మండిపోయింది. ఇతనా పంతులమ్మతో సరసాలడటం కళ్లారా చూసికూడా తను ఎందుకు తేల్చుకోలేదూ?

పార్వతికిష్టమైనట్టే భావించుకోబడింది.

లగ్గాలు పెట్టుకున్నారు. పార్వతి ఇంకా నిర్ణయానికి రాలేదు. పెళ్లిరోజు వచ్చింది. పార్వతి ఆలోచిస్తూనే ఉంది. లగ్గం అయిపోయింది. పార్వతి మెళ్లో మూడుముళ్లూ పడినై.

"నన్ను కూడా అట్లానే ముద్దు పెట్టుకుంటాడు!" అనుకుంది పార్వతి. ఆమె రోమాలన్నీ నిక్కబొడిచినై.

అగ్నిహోత్రం ముందు కూర్చుని ఉండగా ఎవరో వచ్చి, "గోపాలం వచ్చాడురా!" అని పెళ్లికొడుకుతో అన్నారు.

భాస్కర్రావు చప్పున వెనక్కితిరిగి, "ఏడీ రమ్మను!" అన్నాడు.

తన భర్త, గోపాలం అనేవాడికోసం అరనిమిషకాలంలో అయిదుసార్లు వెనక్కు తిరిగిచూడటం పార్వతి గమనించింది.

"ఏంరోయి, పెళ్లికొడకా! ఏదీ మా మరదలు?" అంటూ ఎవరో వచ్చి తనపక్కనే నిలబడ్డారు.

పార్వతి తలకాయ పైకెత్తి చూసింది.

అదే మొహం! అదే జుట్టూ, కళ్లూ!

"వా ! మంచిపిల్లను కొట్టేశావురా, తమ్ముడూ! నేనో అయిదేళ్లు చిన్న వాణ్నయి వుండగూడదూ!" అన్నాడు గోపాలం పార్వతి కళ్లల్లోకి నవ్వుతూ చూస్తూ.

"పెళ్లి కూతురు కళ్లల్లోకి పొగ పోతున్నట్టుంది. కాస్త నిప్పు విసర్రాదూ, పెళ్లికొడకా?" అన్నదో ముసలి ముత్తయిదువు.

*ముద్రణ : కవిరాట్టు, అభూత కల్పనలు - గల్పికలు, 1942*
*యువ కార్యాలయం, తెనాలి*